క్లుప్తంగా

సీఐఎఫ్‌టీ సైంటిస్ట్ ఇన్‌చార్జ్‌గా మధుసూదనరావు



ఏయూక్యాంపస్ : సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ(సీఐఎఫ్‌టీ) విశాఖ ప్రాంతీయ కేంద్రం సైంటిస్ట్ ఇన్‌చార్జిగా డాక్టర్ బి.మధుసూదనరావు నియమితులయ్యారు. సోమవారం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన సీఐఎఫ్‌టీ ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా సేవలు అందిస్తున్నారు. ఆయన అగ్రికల్ రీసెర్చ్ సర్వీసెస్(ఏఆర్ఎస్) అధికారి. 27 ఏళ్ల పరిశోధన అనుభవాన్ని కలిగి ఉన్నారు. 130కిపైగా పరిశోధన పత్రాలు ప్రచురించారు. వందకు పైగా జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. బి.వీఎస్సీ, ఎం.వీఎస్సీల్లో బంగారు పతకాలు సాధించారు. ఇండియన్ వెటర్నరీ అసోసియేషన్, సొసైటీ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజిస్టుల నుంచి అత్యుత్తమ అవార్డులు అందుకున్నారు.

ఆనంద్‌మార్గ్ చిల్డ్రన్ హోమ్‌లో ఉచిత ప్రవేశాలు

ఆరిలోవ : జీవీఎంసీ 10వ వార్డు పరిధి పాత డెయిరీఫారం దరి ఇందిరానగర్‌లో ఆనంద్‌మార్గ్ చిల్డ్రన్ హోమ్‌లో పిల్లలకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు ఆశ్రమం స్వామీజీ ఆచార్య సొమ్యానంద్ అవదూత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఆరు నుంచి పదేళ్ల వయసు గల బాలురకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో పేదలు, అనాథలు, వెనుకబడిన వర్గాల పిల్లలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు నేరుగా వచ్చి హోమ్‌లో సంప్రదించాలని, లేదంటే 9030502164లో సంప్రదించాలని ఆయన సూచించారు.

యువతి అదృశ్యం

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలోని ఉషోదయ కూడలిలో పూడిలోవ హిందు సాయి హర్షిణి (17) అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. నర్సీపట్నానికి చెందిన హర్షిణి బోయపాలెం నారాయణ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గత నెల 30న అనారోగ్యంగా ఉందని చెప్పి ఉషోదయ కూడలి సమీపంలో నివసిస్తున్న పిన్ని ఇంటికి వచ్చింది. అనంతరం ఈ నెల 4న రాత్రి 8.30 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా బ్యాగ్‌తోపాటు స్కూటీ తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కొద్దిసేపటికి గుర్తించిన పిన్ని మంగ నర్సీపట్నంలో ఉంటున్న హర్షిణి తల్లి పూడిలోవ కుమారికి తెలియజేయడంతోపాటు అనేక చోట్ల వెతికినా హర్షిణి ఆచూకీ తెలియలేదు. హర్షిణి తల్లి కుమారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వ్యాస రచన పోటీలు

మద్దిలపాలెం : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని (జూలై 11న) పురస్కరించుకుని డిగ్రీ, పీజీ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని ఏయూ గణాంకాల విభాగం ప్రతినిధి బి.మునిస్వామి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుస్థిర అభివృద్ధి, జనాభా పెరుగుల, పర్యావరణం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని, వక్తృత్వ పోటీలకు సంబంధించిన అంశాన్ని గంట ముందు తెలియజేస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 8న ఉదయం 9 గంటలకు ఏయూ స్టాటిస్టిక్స్ విభాగంలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాలని సూచించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రపంచ జనాభా దినోత్సవం రోజున అందిస్తామని తెలిపారు. వివరాలకు 9701699050, 7981479889లో సంప్రదించాలని సూచించారు.

చిత్రకారులను ప్రోత్సహిద్దాం

మహారాణిపేట: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ ఆయన చిత్రాన్ని పెన్సిల్ స్కెచ్‌తో చిత్రీకరించి బహూకరించిన పల్లా నవోజ్ఞను అభినందించారు. మాధవ్ ఇంటికి సోమవారం బీజేపీ రాష్ట్ర వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ చిత్రకారిణి నవోజ్ఞను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాధవ్‌కు ఆయన చిత్రపటాన్ని నవోజ్ఞ అందజేశారు. మాధవ్ మాట్లాడుతూ ఔత్సాహిక చిత్రకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్, పల్లా జై భరత్ కుమార్, వాయునందనరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి వేడుకలు నేడు

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డులో గల సింహాద్రిపురం కాలనీలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, వార్డు ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ నడింపల్లి క్రిష్ణంరాజు తెలిపారు. ఈ వేడుకలకు వార్డులో గల పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరువాలని కోరారు. వృద్ధులకు దుస్తులు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేయనున్నామని తెలిపారు.



సిద్ధమైన హెలికాప్టర్ మ్యూజియం



అలంకరణ మొక్కలతో ఆకర్షణీయంగా...



మ్యూజియం ప్రవేశ ద్వారం, టికెట్ కౌంటర్

ఎన్నాళ్లీ ఎదురుచూపులు

- ప్రారంభానికి నోచుకోని హెలికాప్టర్ మ్యూజియం
- నాలుగు నెలల క్రితమే పనులు పూర్తి
- నిరాశ చెందుతున్న పర్యాటకులు



నిరాశగా వెళ్లిపోతున్న సందర్శకులు

ఏయూ క్యాంపస్ : నగరానికి పర్యాటకంగా మరింత పేరుతెచ్చే ప్రాజెక్టు పూర్తయి నెలలు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. బీచ్‌రోడ్డులో టీయూ యుద్ధ విమాన మ్యూజియం పక్కనే యూహెచ్ - 3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియం ఏర్పాటు చేశారు. దీని నిర్మాణం, సుందరీకరణ పనులు పూర్తిచేసి దాదాపు నాలుగు నెలలు కావస్తున్నాయి. ఇప్పటికీ ఇది ప్రారంభం కాలేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు నిరాశ చెందుతున్నారు. విశాఖ వాసులనే కాకుండా, పర్యాటకులను సైతం ఆకట్టుకునే విధంగా దీనిని తీర్చిదిద్దారు. కోట్లాది రూపాయలు వెచ్చించి తీర్చిదిద్దిన పర్యాటక ప్రాజెక్టును ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

రూ.2.2 కోట్లతో ఏర్పాటు

భారత నావికాదళంలో 17 సంవత్సరాలు సేవలందించిన యూహెచ్ - 3 హెచ్ హెలికాప్టర్‌కు ఇటీవల సేవల నుంచి విరామం ఇచ్చారు. విపత్తు నిర్వహణ, తీర ప్రాంత భద్రత, తదితర అంశాలలో ఈ హెలికాప్టర్ భారత నావికాదళానికి ఎనలేని సేవలు అందించింది. సేవల నుంచి విరామం పొందిన దీన్ని భారత నావికాదళ సంపత్తిని చాటే విధంగా, నగరానికి వచ్చే పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని పంచే విధంగా ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో దీనిని మ్యూజియంగా మార్పు చేశారు. దాదాపు రూ.2.2 కోట్ల వ్యయంతో దీనిని ఏర్పాటు చేశారు. సుందరీకరణ పనులు పూర్తి చేసుకుని మార్చి నెలాఖరునాటికి సిద్ధమైంది. నాటి నుంచి నేటి వరకు ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. దాదాపు నాలుగు నెలలు కావస్తున్నా దీనికి మోక్షం కలగలేదు.

సుందరీకరణకు ప్రాధాన్యం

హెలికాప్టర్ చుట్టూ అందమైన లాన్‌లు ఏర్పాటు చేశారు. ప్రత్యేకమైన మొక్కలు, లాన్, వాటర్ ఫౌంటెయిన్‌లను నిర్మించారు. దీని చుట్టూ అద్దాలతో కూడిన నిర్మాణం ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. రాత్రి వేళల్లో విద్యుత్ కాంతుల్లో ఇది మరింత శోభను సంతరించుకోనుంది. ఇటీవల కాలంలో యువతలో పెరుగుతున్న సెల్ఫీలు, ఫొటోల ఆసక్తికి అనుగుణంగా అంతర్గత పరిసరాలను తీర్చిదిద్దినట్లు స్పష్టమవుతోంది. ఫొటోలు, రీల్స్‌పై ఆసక్తి చూపే వారికి ఈ ప్రాంగణం ఎంతో ఆకర్షణీయంగా, ఆకట్టుకునే విధంగా నిలుస్తుంది. ప్రవేశాలకు సంబంధించిన టికెట్ ధరలు, సందర్శన వేళలు వంటివి వీఎంఆర్‌డీఏ నేటికీ ప్రకటించలేదు.

తెలుగు ప్రజలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు ప్రతీ నెల విశాఖ నగరానికి వస్తుంటారు. వీరు బీచ్‌రోడ్డులో ఉన్న సబ్‌మెరైన్ మ్యూజియం, టీయూ - 142 మ్యూజియం వంటివి సందర్శిస్తున్నారు. వీటికి చేరువలో ఉన్న హెలికాప్టర్ మ్యూజియం చూడటానికి వెళ్తే... ఇంకా ప్రారంభం కాలేదు అనే సమాధానం విని నిరాశ చెందుతున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులు ఎంతో ఆశగా వీక్షిద్దామని వచ్చి తమను అనుమతించకపోవడంతో కొంత ఇబ్బంది పడుతున్నారు. ఒక్కసారి చూసి వెళ్తామని అక్కడే ఉన్న సెక్యూరిటీని అడుగుతున్నారు. వారు సైతం లోనికి అనుమతించకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో పర్యాటకులు ఈ విధంగా వెనుతిరిగి పోతున్నారు. ప్రజాధనంతో సిద్ధం చేసిన ఈ ప్రాజెక్టును సత్వరమే ప్రారంభించి, ప్రజల సందర్శనకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



హెలికాప్టర్ ఇంజన్ భాగాలు

అందుబాటులోకి తీసుకురావాలి



హెలికాప్టర్ మ్యూజియం వంటివి చూడటానికి పిల్లలు చాలా ఇష్టపడతారు. అదే సమయంలో వారిలో అనేక నూతన ఆలోచనలు, ప్రశ్నలు కలుగుతాయి. వీటిని సందర్శకులకు అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుంది. పర్యాటకానికి ఇటువంటివి ఎంతో గుర్తింపును తీసుకొస్తాయి.

– కె.దినేష్, పర్యాటకుడు, కర్ణాటక

33 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ లా అండ్ ఆర్డర్, టాస్క్‌ఫోర్స్ పోలీసుల సంయుక్త దాడుల్లో పెదవాల్తేర్‌లో 33 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు ఎంవీపీ లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ భరత్‌కుమార్‌తో కూడిన బృందం సోమవారం పెదవాల్తేర్ గాంధీ విగ్రహం సమీపంలో బోరా సతీష్ (39) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న రెండు బ్యాగ్‌లను పరిశీలించగా అందులో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లు లభించాయి. వివిధ రకాల బ్రాండ్‌లకు చెందిన 33 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై సతీష్‌ను ప్రశ్నించగా గత కొంతకాలంగా అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కనకమ్మ తొలేళ్ల ఉత్సవం



విశేష అలంకరణలో అమ్మవారు

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డులోని ఇసుకతోట జాతీయ రహదారి పక్కనున్న శ్రీ కనక దుర్గ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ సేవా మండలి సభ్యులు అమ్మవారిని విశేషంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి గ్రామంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులు సమర్పించారు. ఈ సందర్భంగా సాయంత్రం అమ్మవారి శతకంపట్టు నుంచి మహిళలు సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. సంఘం అధ్యక్షుడు కోరిబిల్లి త్రినాథ్ శివ సత్యబాబు, ఉపాధ్యక్షుడు మద్ది శశిభూషణరెడ్డి, కార్యదర్శి సూరిశెట్టి అప్పలరాజు, సూరిశెట్టి సత్యనారాయణ, పెంటకోట రమేష్, రాపేటి గోవిందరాజు, పెంటకోట చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా పైప్‌లైన్‌కు మరమ్మతులు

- నేటి నుంచి యథావిధిగా నీరు సరఫరా



కేర్ ఆస్పత్రి వద్ద నీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

ఆరిలోవ : జీవీఎంసీ జోన్ – 2 పరిధి ఆరిలోవ ప్రాంతంలో సోమవారం నీటి సరఫరా విభాగం సిబ్బంది పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టారు. చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం ఎదురుగా కేర్ ఆస్పత్రి పక్కన కొమ్మాది నుంచి సరఫరా జరిగే నీటి సరఫరా మెయిన్ లైన్‌కు మరమ్మతులు జరిపారు. ఇందులో భాగంగా కొమ్మాది పైప్‌లైన్ నుంచి ఆరిలోవ వైపు నీటి సరఫరా జరగకుండా హనుమంతవాక ప్రాంతం ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వద్ద పైప్‌లైన్ వాలు విప్పి నీటిని గెడ్డలోకి విడిచిపెట్టారు. దీంతో ఆ నీరు వృథాగా గెడ్డలో కలిసిపోయింది. ఇక్కడ బీఆర్‌టీఎస్ పక్కన కొంత ఎత్తు నుంచి నీరు గెడ్డలో పడడంతో వాటర్ ఫాల్స్‌ను తలపించింది. ఇక్కడ మరమ్మతులు చేపట్టడంతో ఆరిలోవ ప్రాంతంలో నీటి సరఫరా నిలిపేశారు. జీవీఎంసీ 10వ వార్డు పరిధి వెటర్నరీకాలనీ, ఇందిరానగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్, ఎస్.ఐ.జి.నగర్, బి.ఎన్.ఆర్.నగర్, తోటగరువు, తదితర ప్రాంతాలతోపాటు 11వ వార్డు పరిధి కైలాసనగర్, గాంధీనగర్, డ్రైవర్స్ కాలనీ, ముస్తఫాకాలనీ, బాలాజీనగర్, పాత ఆరిలోవ, పార్వతినగర్, టి.ఐ.సి పాయింట్, వికలాంగుల కాలనీ, జీవీఎంసీ 12వ వార్డు పరిధి సుందరయ్యకాలనీ, నెహ్రూ నగర్, హిందీ కాలేజీ ప్రాంతం, అంబేడ్కర్ నగర్, సాలిపేట, పెదగదిలి, చినగదిలి, సంతపాలెం, రామలక్ష్మీపురం, నేతాజీనగర్, న్యూకాంతినగర్, తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ పనులు సోమవారం సాయంత్రానికి పూర్తయ్యాయి. దీంతో మంగళవారం నుంచి యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందని అధికారులు తెలిపారు.

అఖిల భారత సమ్మెకు కార్మికులు సహకరించాలి



డెయిరీఫారం వద్ద ఎర్ర జెండాలతో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మికుల వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా ఈ నెల 9న చేపడుతున్న సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు కోరారు. సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం మద్దిలపాలెం జోన్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిని ఆనుకుని పాత డెయిరీఫారం వద్ద సోమవారం ఆటో జాత ప్రారంభించారు. దీని ద్వారా కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9న అఖిల భారత సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తులసీరామ్, సీపీఎం నాయకులు నరేంద్రకుమార్, డి.నాగరాజు, భూలోకరావు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో మరమ్మతులు



రామకృష్ణాపురం కూడలి వద్ద పూడ్చిన గొయ్యి



రోడ్డు మధ్యలో ఊడ్చకుండా వదిలేసిన రాయి పిక్కలు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ : బీఆర్‌టీఎస్ రోడ్డులో మరమ్మతులు చేపడుతున్నారు. అయితే ఈ పనులు అరకొరగా చేసుకుపోతూ మమా అనిపించేస్తున్నారు. బీఆర్‌టీఎస్‌లో గోతులు, ఫుట్‌పాత్‌లపై పిచ్చి మొక్కలు, పెదగదిలి నుంచి హనుమంతవాక వరకు సర్వీస్ రోడ్డు శిథిలమై పైకి రాళ్లు తేలిపోవడం, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులు కారణంగా అస్తవ్యస్తంగా మారింది. దీంతో ఈ నెల 9న శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి గిరి ప్రదక్షిణ భక్తులకు ఆటంకం కలిగించే విధంగా నిలిచింది. దీనిపై 'బీఆర్‌టీఎస్ శిథిలం' శీర్షికతో ఈ నెల 6న సాక్షిలో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాలతో సిబ్బంది ఆదివారం నుంచి ఆయా పనులు చేపట్టారు. శానిటరీ సిబ్బంది ఫుట్‌పాత్‌లపై పిచ్చి మొక్కలను తొలగించారు. ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది పలుచోట్ల రోడ్ల మధ్యలో పడిన గోతులను పూడ్చుతున్నారు. అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులలో భాగంగా తవ్విన గోతులను పూడ్చుతున్నారు. రామకృష్ణాపురం కూడలి వద్ద ప్రమాదకరంగా మారిన గొయ్యను పూడ్చారు. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ... అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ గోతులను పూడ్చిన తర్వాత అక్కడ వినియోగించిన పిక్క, ఇసుక శుభ్రం చేయకుండా వదిలేశారు. దీంతో చిన్నచిన్న రాళ్లతో రోడ్డంతా అస్తవ్యస్తంగా మారింది. ఇది గిరి ప్రదక్షిణ భక్తులకు ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. కాళ్లకు చెప్పులు వేసుకోకుండా నడిచే భక్తులకు ఈ రాళ్లు ఇబ్బందిగా మారనున్నాయి. హనుమంతవాక నుంచి రామకృష్ణాపురం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

టీడీపీలో ముసలం

- మామిడి తోటలో 13వ వార్డు నాయకుల సమావేశం
- జనం రారనే భయంతో 'తొలి అడుగు' రద్దు



శ్రీకృష్ణాపురం మామిడితోటలో సమావేశమైన 13వ వార్డు టీడీపీ నాయకులు

ఆరిలోవ : జీవీఎంసీ 13వ వార్డు టీడీపీలో వర్గపోరు రాజుకుంటోంది. ఇప్పటికే ఈ వార్డులో టీడీపీ నాయకుల్లో రెండు వర్గాలున్నాయి. వాటికి తోడు ఇప్పుడు ప్రాంతాల వారీగా కొత్తగా వర్గాలు పుట్టుకొస్తున్నాయి. దీంతో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు కొత్త తలనొప్పులు మొదలయ్యాయి. ఈ క్రమంలో వార్డులో సోమవారం సాయంత్రం జరగాల్సిన 'తొలి అడుగు' కార్యక్రమం సైతం వాయిదాపడింది. దీంతో ఆ పార్టీ కార్యకర్తలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. వర్గాలుగా విడిపోయిన కార్యకర్తలు కారణంగా జనం కరువై 'తొలి అడుగు' కార్యక్రమం వాయిదా వేసినట్లు ఆ పార్టీ కార్యకర్తలల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వార్డు విశాలమైంది కావడంతో ప్రాంతాల వారీగా ఆ పార్టీలో నాయకులకు ప్రాధాన్యత ఉండటం లేదని కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు. వార్డు పరిధి రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్, పైనాపిల్‌కాలనీ, దారపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు సోమవారం శ్రీకృష్ణాపురం మామిడి తోటలో సమావేశమయ్యారు. తమ గ్రామాల నాయకులకు సమాచారం ఇవ్వడంలేదని, ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, దీన్‌దయాల్‌పురం ప్రాంతాల వారికే ఎమ్మెల్యే వార్డు కమిటీలో పదవులన్నీ ఇచ్చారని, వార్డులో ఏ కార్యక్రమం జరిగినా ఈ ఐదు గ్రామాల నాయకులకు సమాచారం ఇవ్వడం లేదనే అంశాలపై చర్చించారు. తమ ఐదు గ్రామాల్లోని నాయకులకు వార్డు కమిటీలో కీలక స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఓట్లు కోసం నేరుగా గ్రామాలకు వచ్చి అందర్నీ అడిగిన ఎమ్మెల్యే ఇప్పుడు కార్యక్రమాల కోసం సమాచారం ఇవ్వడంలో పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అందుకే సోమవారం సాయంత్రం జరగాల్సిన 'తొలి అడుగు' కార్యక్రమాన్ని ఆ ఐదు గ్రామాల టీడీపీ నాయకులు బాయ్‌కట్ చేశారు. దీంతో జనం లేకపోతే పరువుపోతుందనే భయంతో కార్యక్రమాన్ని పూర్తిగా వాయిదా వేసేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ సమావేశంలో జక్కన్న, ప్రసాద్, శ్రీను, రమణమూర్తి, బంగార్రాజు, త్రినాథ్, వరం, కాశీ పాల్గొన్నారు.

రోడ్డుపై యువకుల హల్‌చల్



కేక్ ముక్కలు విసురుకుంటున్న యువకులు

బీచ్‌రోడ్డు : స్నేహితురాలి జన్మదిన వేడుకలను కొందరు యువకులు నడిరోడ్డుపై జరిపి వాహనదారులకు ఇబ్బంది కలిగించారు. సిరిపురం సర్కిల్‌లో 30 మంది యువకులు తమ స్నేహితురాలి పుట్టిన రోజు వేడుకలను ఆదివారం రాత్రి జరిపారు. కేక్ కట్ చేయించి ఆ కేక్‌ను ఒకరిపై ఒకరు విసురుకుంటూ హల్‌చల్ చేశారు. దీంతో ఆటుగా వెళ్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నడిరోడ్డుపై యువకులు చేసిన హల్‌చల్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసిన వారు నగరంలో అసలు పోలీసులు ఉన్నారా..? అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్రీ హోల్డ్ భూములు స్వాధీనం చేసుకోండి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విదసం నాయకులు

బీచ్‌రోడ్డు : జీవో 596కు విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ చేసిన 6 లక్షల ఎకరాల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తిరిగి ఎస్సీలకే కేటాయించాలని విదసం(విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండు చేశారు. అసైన్డ్ భూముల్లో అక్రమాలు సరిదిద్ది దళితులకు న్యాయం చేయాలని కోరుతూ విదసం నేతృత్వంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా చేపట్టారు. ఉమ్మడి విశాఖ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో దళిత శ్రేణులు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ 3 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు హక్కుదారుల పేర్లు, రికార్డులను మాయం చేసి కబ్జాకోరులు వారి పేరున ఫ్రీ హోల్డ్ చేసుకున్నారన్నారు. అటువంటి వారి నుంచి రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రమే వసూలు చేయాలని ప్రభుత్వంలోని కొందరు పెద్దలు సలహా ఇవ్వడం దుర్మార్గమని మండిపడ్డారు. ఫ్రీ హోల్డ్ భూముల క్రయవిక్రయాలు ఒకే సామాజిక వర్గం మధ్యలో జరిగేలా జీవో సవరించాలన్నారు. శారదా పీఠం నుంచి వెనక్కి తీసుకున్న భూములను రామ్‌దేవ్ బాబాకు కేటాయించే ప్రతిపాదన మంచిదికాదని హితవు పలికారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో భూ కుంభకోణంపై టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు రెండు సిట్‌లు వేశాయని, అందులో 700 ఎకరాల అసైన్డ్ భూముల తోపాటు 2 వేల ఎకరాల భూముల అక్రమాలు జరిగాయని సిట్ నివేదిక ఇస్తే.. ఏ ప్రభుత్వమూ చర్యలు తీసుకోలేదన్నారు. సభాధ్యక్షుడు ఓంకార్ మాట్లాడుతూ తెనాలిలో ముగ్గురు యువకులను పోలీసులు నడిరోడ్డు మీద చితక్కొట్టిన ఘటనపై ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బానాస నుంచి టి శ్రీరామమూర్తి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలోని మల్లం గ్రామంలో దళితవాడను వెలివేస్తే కనీసం కేసు నమోదు కాలేదని, వెంటనే ఈ దురాగతాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.చిన్నారావు, తంటడి కిరణ్‌కుమార్, కొత్తపల్లి వెంకటరమణ, బాగం గోపాల్ పాల్గొన్నారు.

లీడ్ గ్రూప్ విద్యార్థులకు 1ఎం 1బీ గ్రీన్ ఇంటర్న్‌షిప్



ప్రేరణా రెడ్డిని అభినందిస్తున్న ఆచార్య కృష్ణమోహన్ తదితరులు

ఎంవీపీ కాలనీ : లీడ్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులకు బెంగళూరుకు చెందిన 1ఎం 1బీ (వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్) ప్రఖ్యాత గ్రీన్ ఇంటర్న్‌షిప్ వర్క్ ప్లేస్ ఎక్స్‌పీరియన్స్ లభించింది. ఈ మేరకు ఎంవీపీ కాలనీలోని లీడ్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ జనరల్ ఆచార్య వి.కృష్ణమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ లీడ్ గ్రూప్‌నకు చెందిన వేర్వేరు విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న ప్రేరణా రెడ్డి, జాన్ ప్రకాష్‌లకు ఈ అరుదైన అవకాశం దక్కినట్లు తెలిపారు. ఈ ప్రఖ్యాత ఇంటర్న్‌షిప్ ఆయా విద్యార్థుల కేరీర్ గైడెన్స్‌తోపాటు పర్యావరణ బాధ్యత నాయకత్వాన్ని పెంచుతుందన్నారు. ఈ సందర్భంగా ఇంటర్న్‌షిప్‌ను సాధించిన విద్యార్థులను సత్కరించారు.

మెగా పేరెంట్ మీటింగ్‌కు ఏర్పాట్లు



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఆర్జేడీ ఆదినారాయణ

మద్దిలపాలెం : మెగా పేరెంట్ మీటింగ్ మద్దిలపాలెం జూనియర్ కళాశాల వేదికగా ఈ నెల 10న నిర్వహించనుండడంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇంటర్మీడియట్ బోర్డు ఆర్జేడీ మజ్జి ఆదినారాయణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించారు. ఆహార నాణ్యత పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెగా పేరెంట్ మీటింగ్‌కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధ్యాపకులను ఆదేశించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమావేశానికి హాజరయ్యేలా అధ్యాపకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామ వేదవ్యాస్, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసినాయుడు, ఆర్పీ నాయుడు, మురళీక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ ఎరీనా స్వాధీనానికి వినతి

దాబాగార్డెన్స్: ఎంవీపీ కాలనీలోని జీవీఎంసీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను కాంట్రాక్టర్ నుంచి స్వాధీనం చేసుకోవాలని సీపీఎం ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు కోరారు. సోమవారం మేయర్ పీలా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా సుమారు రూ.25 కోట్లతో ఎంవీపీ కాలనీలోని ఎకరా 40 సెంట్లలో రెండంతస్తుల్లో ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా 2022లో నిర్మించారన్నారు. ఇందులో బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్ కోర్టులు, స్విమ్మింగ్ పూల్స్, ఆధునిక జిమ్, యోగా, చెస్ ఇలా అనేక రకాల సదుపాయాలున్నాయని వివరించారు. స్పోర్ట్స్ ఎరీనా ఆపరేషన్, మెయింటెనెన్స్, మేనేజ్‌మెంట్‌ను 2023 నుంచి ఐదేళ్ల పాటు కేకే కార్పొరేషన్ మొబి కేర్ అనే జాయింట్ వెంచర్ సంస్థకు ఏడాదికి కనీసంగా రూ.1,02,569 అద్దె చెల్లించేలా ఇచ్చారని, ఈ సంస్థ అద్దె చెల్లించడం లేదని, ఇప్పటి వరకు సుమారు రూ.2 కోట్లు బకాయి పడిందన్నారు. ఎరీనాకు వచ్చే పిల్లలు, పెద్దల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఆ సొమ్మంతా కాంట్రాక్టర్ సొంత ఖాతాలో వేసుకుంటున్నారన్నారు. జీవీఎంసీ పాఠశాలల పిల్లలను ఎరీనాలోకి రానివ్వడం లేదని, జీవీఎంసీ ఉద్యోగులకు 50 శాతం రాయితీ కూడా అమలు చేయడం లేదని చెప్పారు. తక్షణం లీజు బకాయి వసూలు చేసి కాంట్రాక్టర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. జీవీఎంసీ కౌన్సిల్‌లో దీనిపై ప్రత్యేక ఎజెండా పెట్టి చర్యలు చేపట్టాలని మేయర్‌ను కోరారు.